

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY


ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787


PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 11-02-2026 సంపుటి : 07 సంచిక 267 పేజీలు : 8 వెల : రూ 3-00

# విశాఖ మెట్రోకు గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10,ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి భారీ శుభవార్త అందింది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టుకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం చంద్రబాబుకు ఈ మేరకు ఈ సానుకూల స్పందన లభించడం గమనార్హం.సోమవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్న సీఎం చంద్రబాబు, ఇవాళ పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమయ్యారు. ఈ క్రమంలోనే కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విశాఖ మెట్రో ప్రాజెక్టుకు అనుమతి ఇస్తున్నట్లు ఖట్టర్ స్వయంగా చంద్రబాబుకు తెలిపినట్లు సమాచారం. ఈ నిర్ణయంతో విశాఖ మెట్రో ఏర్పాటులో కీలక ముందడుగు పడినట్లయింది.విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్రో రైల్ ప్రాజెక్టులను చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు కూడా పంపింది. తాజాగా చంద్రబాబు పర్యటన నేపథ్యంలో విశాఖ ప్రాజెక్టుకు ఆమోదం లభించడంతో త్వరలోనే పనులు ముందుకు సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. విజయవాడ మెట్రో ప్రతిపాదనపై కూడా త్వరలో స్పష్టత రావచ్చని అధికారులు భావిస్తున్నారు.ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర ప్రయోజనాలపై చర్చించారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత వ్యవహారంపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తో ఏపీ సీఎం చంద్రబాబు చర్చించారు. ఏపీకి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల్లో పురోగతి, కేంద్రం సహకారంపై కేంద్ర మంత్రులలో చంద్రబాబు వరుసగా భేటీ అవుతున్నారు. ఈ క్రమంలో అమిత్ షాతో భేటీలో భాగంగా ఇదివరకే పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలని కేంద్రం నిర్ణయించగా.. అమరావతికి చట్టబద్ధతకు సంబంధించిన అంశాలపై చర్చలు జరిపినట్లు సమాచారం. పార్లమెంట్ బడ్జెట్ రెండో దశ సమావేశాల్లో రాష్ట్రానికి కీలకమైన ఈ బిల్లు పెట్టాలని కేంద్ర మంత్రిని సీఎం చంద్రబాబు కోరినట్లు తెలుస్తోంది. ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో మంగళవారం ఉదయం భేటీ అయ్యారు. రాష్ట్రంలోని వివిధ సాగునీటి ప్రాజెక్టులకు అనుమతులు, ఆర్థిక సాయంపై విజ్ఞప్తి చేశారు. ఏపీ ప్రయోజనాలు, రైతుల భవిష్యత్, తాగునీటి భద్రతకు ఇవి ఎంతో ముఖ్యమని వివరించారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్ర సాయంపై పెండింగ్‌లో ఉన్న అంశాలతో పాటు, అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపైనా చర్చించారు. ఈ భేటీలో రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, పలువురు అధికారులు ఉన్నారు.పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి స్టాప్ వర్క్ ఆర్డర్ శాశ్వతంగా ఎత్తివేసేలా నిర్ణయం తీసుకోవాలని, ఈ ఆర్డర్ కారణంగా ప్రాజెక్టు అమలులో అవరోధాలు ఏర్పడుతున్నాయని చంద్రబాబు కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల సామర్థ్యం పెంపు కారణంగా పెరిగిన వ్యయాన్ని రీయింబర్స్‌మెంట్ చేయాలని కోరారు.పోలవరం ప్రాజెక్టు ఫేజ్?ఎకి ఆర్థిక సహాయం అందించాలి... ఫేజ్?ఎలో భూసేకరణ, పునరావాసం, రక్షణ కట్టలు వంటి పనులు చేపట్టాలని చంద్రబాబు తెలిపారు. వీటికి అదనంగా దాదాపు రూ.32,000 కోట్ల నిధులు అవసరం అన్నారు.




గోదావరి వరద జలాలను వర్షాభావ ప్రాంతాలకు తరలించే లక్ష్యంతో పోలవరం? నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టుకు ప్రతిపాదనలు చేశారు. ఇది తాగునీరు, సాగునీరు, పరిశ్రమల అవసరాలు తీర్చే కీలక ప్రాజెక్టు అని చంద్రబాబు స్పష్టం చేశారు. జాతీయ నదుల అనుసంధాన విధానంలో భాగంగా ఈ ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేసి, సాంకేతిక, ఆర్థిక సాయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ- ఒడిశా మధ్య వంశధార నీటి వివాదాన్ని పరిష్కరించాలని చంద్రబాబు కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. వంశధార నీటి వివాద ట్రిబ్యునల్ (వీడబ్ల్యుడీటీ) తుది నివేదిక గెజెట్‌లో ప్రచురించాలని, ట్రిబ్యునల్ నివేదికను వెంటనే గెజెట్‌లో ప్రచురించి, వంశధారపై నిర్మించే నేరడి బ్యారేజ్ నిర్మాణానికి అడ్డంకులు లేకుండా చేయాలని కోరారు.గోదావరి జలాల పంపకంపై ఏపీ- తెలంగాణ మధ్య వివాదం కొనసాగుతోందని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. నదీ జలాల పంపకం కోసం గోదావరి నీటి వివాదాల ట్రిబ్యునల్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలి. ఎగువ కృష్ణాపై ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపునకు కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన చర్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తును పెంచడం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే దిగువ ప్రవాహ జలాలపై తీవ్ర ప్రభావం ఉంటుందని కేంద్ర మంత్రికి తెలిపారు.

# అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం చంద్రబాబు థ్యాంక్స్



న్యూఢిల్లీ/అమరావతి, ఫిబ్రవరి10: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ఢిల్లీ పర్యటన మంగళవారం బిజీ బిజీగా సాగుతోంది. కేంద్ర మంత్రులతో ఆయన వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు రైల్వే ప్రాజెక్టలతో కూడిన వినతి పత్రాన్ని కేంద్ర మంత్రికి అందజేశారు. రాష్ట్రంలోని వివిధ రైల్వే ప్రాజెక్టులను పూర్తి చేసి, కొత్త రైలు మార్గాలలో సర్వీసులను నడపాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇటీవల బడ్జెట్‌లో ప్రకటించిన హైదరాబాద్ – బెంగళూరు, హైదరాబాద్ – చెన్నై, చెన్నై – బెంగళూరు హైస్పీడ్ రైల్ కారిడార్ల గురించి ఈ భేటీలో ప్రస్తావించారు చంద్రబాబు. అలాగే ఏపీ మీదుగా వెళ్లే మూడు హైస్పీడ్ రైల్ కారిడార్లను ప్రకటించడం పట్ల కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఇక బెంగళూరు – చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్.. తిరుపతిని అనుసంధానం చేసేలా చూడాలని కేంద్ర మంత్రిని కోరారు సీఎం. దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యేలా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. తాడిపత్రి నుంచి ముంబై జేఎన్‌పీటీ పోర్టుకు అరటి ఎగుమతులకు వీలుగా 50 శాతం రాయితీపై ఖాళీ రీఫర్ కంటైనర్లు కేటాయించాలని మంత్రిని కోరారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అమరావతిలలో గ్రీన్ ఫీల్డ్ మెగా కోచింగ్ టెర్మినళ్లు ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరారు.దేశంలో ఉత్తర – దక్షిణ ప్రాంతాలను కలిపేలా ఇటార్సీ – విజయవాడ మధ్య ప్రత్యేక సరకు రవాణా కారిడార్ ఏర్పాటుకు సహకారం అందించాలని అశ్వినీ వైష్ణవ్‌కు సీఎం విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని పోర్టులను అనుసంధానిస్తూ విజయవాడ మీదుగా ఖరగ్‌పూర్ – చెన్నై మధ్య ఈస్ట్ కోస్ట్ ఫ్రైట్ కారిడార్ ఏర్పాటు చేయాలని కోరారు. రాయలసీమ సహా గిరిజన ప్రాంతాలను అనుసంధానించేలా వివిధ కొత్త రైల్వే మార్గాల ప్రతిపాదనల్ని ఆమోదించాలని మంత్రిని సీఎం విజ్ఞప్తి చేశారు.అదే విధంగా.. విశాఖ – విజయవాడ మధ్య హైస్పీడ్, విజయవాడ – కర్నూలు మధ్య సెమీ హైస్పీడ్, తిరుపతి – చిత్తూరు మధ్య హైస్పీడ్ లింక్ కారిడార్ మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ – శ్రీశైలం – మార్కాపురం కొత్త రైల్వే లైన్ ద్వారా శ్రీశైల పుణ్యక్షేత్రానికి కనెక్టివిటీని పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తిరుపతి మీదుగా విజయవాడ – బెంగళూరు మధ్య వందేభారత్ సర్వీసును నడపాలన్నారు. ఇక వివిధ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కుప్పంలో స్టాపింగ్ ఇవ్వటంతో పాటు రైలు బోగీల నిర్వహణ టెర్మినల్ ఏర్పాటు చేయాలని అశ్వినీ వైష్ణవ్ దృష్టికి సీఎం చంద్రబాబు తీసుకెళ్లారు.

# శివరాత్రి నాటికి ఆలయాల్లో పటిష్ఠ చర్యలు తీసుకోండి: సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 10: శ్రీశైలం సహా వివిధ శివాలయాల్లో భక్తుల రద్దీ, వసతులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ రోజు సమీక్ష నిర్వహించారు. శివారాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ, సౌకర్యాలపై మంత్రులు, ప్రధాన కార్యదర్శి, డీజీపీలతో పాటు ఇతర అధికారులతో ఢిల్లీ నుంచి సీఎం సమీక్షించారు. శివరాత్రి నాటికి ఆలయంలో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశమున్న నేపథ్యంలో పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీచేశారు.రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, హోం మంత్రి అనిత.. ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లు, వసతులపై అధికారులతో పర్యవేక్షించాలని సీఎం సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అలాగే, దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు త్వరితగతిన దర్శనం పూర్తయ్యేలా.. సరైన వసతి లభించేలా కార్యచరణ అమలు చేయాలని ఆదేశించారు. దీక్షలు, మాలధారణలతో ఎంతో కష్టపడి ఆలయానికి చేరుకునే భక్తులకు ఇబ్బంది కలిగేలా, అగౌరవపరిచేలా ఎవరూ వ్యవహరించకూడదని స్పష్టం చేశారు.రోజు రోజుకూ దేవాలయాల్లో పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చంద్రబాబు సూచించారు.



# స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం..

## లోక్‌సభలో జరిగేది ఇదే

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి ప్రతిపక్షం సిద్ధమైంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రసంగానికి అనుమతించనందుకు, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేపై చర్యలు తీసుకోనందుకు నిరసనగా స్పీకర్‌పై ఓం బిర్లాపై కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైంది. మరి ఈ అవిశ్వాస తీర్మానానికి సంబంధించి నియమనిబంధనలు ఏమిటో ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాంరాజ్యాంగంలోని ఆర్టికల్ 94(సీ) కింద లోక్‌సభ స్పీకర్ లేదా డిప్యూటీ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టొచ్చు. ఈ తీర్మానాన్ని సభ ఆమోదిస్తే స్పీకర్, లేదా డిప్యూటీ స్పీకర్ తమ పదవిని కోల్పోతారు. ఈ తీర్మానానికి సంబంధించి కనీసం 14 రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాల్సి ఉంటుంది.లోక్‌సభ కార్యకలాపాల నిబంధనల ప్రకారం, లోక్‌సభ ఎంపీ ఎవరైనా ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టొచ్చు. ఇందుకోసం లిఖిత పూర్వకంగా లోక్‌సభ సెక్రెటరీ జనరల్‌కు ముందస్తు నోటీసు ఇవ్వాలి. ఆ తరువాత సభలో నిర్వహించాల్సిన కార్యకలాపాల జాబితాలో ఈ తీర్మానాన్ని చేరుస్తారు. దీనిపై చర్చకు ఒక తేదీని కేటాయిస్తారు. ప్రస్తుతం ఈ తేదీని డిప్యూటీ స్పీకర్ నిర్ణయించనున్నారు.ఇక నిర్ణీత తేదీన లోక్‌సభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెడతారు. ఆ సమయంలో సభలో ఉన్న కనీసం 50 మంది ఎంపీలు తీర్మానికి మద్దతు తెలిపితేనే ఓటింగ్‌కు మార్గం సుగమం అవుతుంది. లేకపోతే ఆదిలోనే ఇది వీగిపోతుంది. తీర్మానాన్ని సభ ఓటింగ్‌కు స్వీకరించాక ఎంపీలు మూజువాణీ ఓటు ద్వారా లేదా ఇతర ప్రత్యామ్నాయ ఓటింగ్ విధానాల్లో తమ అభిప్రాయాన్ని తెలియజేస్తారు.అసలు ఈ తీర్మానం సభ ముందుకు వచ్చే అర్హత ఉందా? లేదా? అనే అంశం కూడా సంక్లిష్టమైనదని నిపుణులు చెబుతున్నారు. ప్రతిపక్షాల తీర్మానం కొన్ని నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే డిప్యూటీ స్పీకర్ దాన్ని స్వీకరిస్తారు. అంటే ఎలాంటి సాంకేతిక, ఇతరత్రా లోపాలు ఉండకూడదు. తీర్మానంలో ప్రతిపక్షాలు పేర్కొన్న ఆరోపణలు స్పష్టంగా ఉండాలి. సభ్యుల వాదనలు, అభిప్రాయాలు, అన్వయాలు, అవమానకరంగా ఉండే వ్యాఖ్యలకు అవిశ్వాస తీర్మానంలో చోటు ఉండదు. ఇందుకు అనుగుణంగా ఉన్న తీర్మానాన్నే డిప్యూటీ స్పీకర్ స్వీకరిస్తారు.ఇక ఓటింగ్ రోజున సభలో ఉన్న మెజారిటీ ఎంపీలు అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా ఓటువేస్తేనే ప్రతిపక్షాల లక్ష్యం నెరవేరుతుంది. ప్రస్తుతం బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ కూటమికి 293 ఎంపీల మద్దతు ఉంది. ప్రతిపక్ష ఐఎన్‌డీఐఏ కూటమిలో 238 ఎంపీలే ఉన్నారు. దీంతో, అవిశ్వాస తీర్మానంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.






# సంపాదకీయం

బుధవారం 11-02-2026

## అందరి చూపు సుప్రీం వైపు

సర్ ప్రక్రియలో ఎలాంటి ఆటంకం కలిగించేందుకు అనుమతించబోమని, అన్ని రాష్ట్రాలు ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ విషయంలో అవసరమైతే ఆదేశాలు జారీ చేస్తామని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న ఓటరు జాబితా సమగ్ర సవరణ అంశంపై దాఖలైన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ మాట్లాడుతూ అధికారుల పేర్లు ఇవ్వాలని ఎన్నికల సంఘం రాష్ట్రాన్ని ఎప్పుడూ కోరలేదన్నారు. దీనికి సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ స్పందిస్తూ ప్రస్తుతం 8,500 మంది అధికారుల జాబితాను సమర్పించామని, దాన్ని కోర్టు స్వీకరించాలని కోరారు. దీనికి సీజేఐ స్పందిస్తూ ఆ జాబితాలో అధికారుల పేర్లు, హోదాలు, పనిచేసే ప్రాంతాల వివరాలు ఉన్నాయా అంటూ ఆరా తీశారు. వారిని ఎలా సంప్రదిస్తారు? మరుసటి రోజే సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారుల (ఈఆర్వో) వద్ద రిపోర్ట్ చేయగలరా? అంటూ ప్రశ్నించగా.. దానికి న్యాయవాది దివాన్ అవునని సమాధానం ఇచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సమీక్షలో భాగంగా పశ్చిమబెంగాల్ లోని ఓటర్ల జాబితాల్లోంచి వేలాది మంది ఓటర్లను అనర్హులుగా తొలగించారు. రాజ్యాంగ విరుద్ధంగా ఈ విధంగా తొలగించడం అన్యాయమని ధ్వజమెత్తుతూ దీనిపై తక్షణం జోక్యం చేసుకోవాలని కోరుతూ పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సుప్రీంకోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావడం సంచలనం కలిగించింది. నిజాయితీగా అర్హులైన ఓటర్లకు జాబితాలో చోటు లభించాలి. ఈమేరకు హామీ ఇవ్వాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌దే. ప్రత్యేక సమగ్ర సర్వే చేపట్టక ముందు పశ్చిమబెంగాల్ ఓటర్ల జాబితాలో 7.66 కోట్ల వరకు ఎంట్రీలు ఉండేవి. అందులోంచి 58 లక్షల పేర్లను తొలగించిన తరువాత ఎన్నికల కమిషన్ నమూనా జాబితాను ప్రకటించి 1.16 కోట్ల ఎంట్రీల్లో తార్కిక వైరుధ్యాలు ఉన్నాయని వెల్లడించింది. ఇది క్షేత్రస్థాయి వాస్తవాలను విస్మరించి చేసిన ఒక ప్రయత్నం లేదా నిర్ణయాన్ని సమర్ధించుకోవడానికి ఉపయోగించే తప్పుడు సాకును తెలియజేస్తుందని చెప్పవచ్చు. ఈ పొంతనలేని అసంబద్ధమైన పదజాలాన్ని ఉపయోగించి ఎన్నికల సంఘం పశ్చిమబెంగాల్ ప్రజలను తమ పాలకులను ఎన్నుకునే హక్కు నుంచి దూరం చేయడమే అవుతుంది. ఓటు వేసే హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభంలా ఆచరణలో ఉంటోంది. భారత దేశం వివిధ భాషలు, మాండలికాలు కలిగిన బహుళ భాషా సమాజం ప్రపంచం లోనే అత్యధికంగా భాషా వైవిధ్యం కలిగిన దేశాల్లో ఒకటిగా భారత్ పరిగణించబడుతోంది. రాజ్యాంగం లోని 8వ షెడ్యూల్‌లో 22 భాషలకు గుర్తింపు కలిగినప్పటికీ దేశవ్యాప్తంగా వందలాది భాషలు వాడుకలో ఉన్నాయి. ఈ భాషల్లో సరైన నామవాచకాలు రాసేటప్పుడు తేడాలు, అనివార్యమైన తప్పులు చోటు చేసుకోవచ్చు. దీదీ వాదనలను న్యాయమూర్తులు జోయ్‌మల్య బాగ్చి, వీఎం పంచోలిలతో కూడిన ధర్మాసనం అంగీకరించింది. సీఎం ఆవేదనలో నిజం ఉందని, ప్రతీ సమస్యకూ పరిష్కారం ఉంటుందని హామీ ఇచ్చింది. అనంతరం మమతా బెనర్జీ పిటిషన్‌పై స్పందన కోరుతూ ఎన్నికల సంఘానికి ధర్మాసనం నోటీసు కూడా జారీ చేసింది. విచారణ సందర్భంగా.. ఈసీఐపై మమతా బెనర్జీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ ప్రక్రియలో ఆధార్‌ను అంగీకరించకుండా కోర్టు ఆదేశాలను ఎన్నికల సంఘం ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. ఎన్నికల ముందు తమ రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారని మండిపడ్డారు. సర్ ఒత్తిడి కారణంగా 100 మందికిపైగా ప్రజలు మరణించారని దీదీ ఆరోపించారు. అనేక మంది ఆసుపత్రి పాలయ్యారన్నారు. ప్రజల హక్కలును కాపాడండి అంటూ దీదీ తన వాదనలను ముగించారు. పురుషులు, మహిళలు వయసులో తేడాలు, 15 ఏళ్ల కన్నా తక్కువ లేదా 50 ఏళ్ల వరకు తమ తల్లిదండ్రులకు తమకు తేడా ఉండవచ్చు. కొన్నిసార్లు దంపతులకు ఆరు లేదా అంతకన్నా ఎక్కువ సంతానం ఉండవచ్చు. చాలా మంది మహిళలు తమ పేరు చివరన తమ భర్త పేరు చేర్చుకుంటుంటారు. ఇవన్నీ భారత దేశ ప్రజాజీవనంలో వాస్తవాలే తప్ప ఓటర్ల జాబితాలో పేర్లను కొట్టేసినంత శక్తివంతమైన తార్కిక వ్యత్యాసాలు కావు. ఈ సమస్యలను సుప్రీం కోర్టే స్వయంగా ప్రస్తావించిందని గుర్తు చేసుకోవాలి. ఓటర్ల జాబితాల్లోంచి పేర్లను తొలగించడానికి వాటిని సాకుగా ఉపయోగించడంపై తన అసమ్మతిని వ్యక్తం చేసింది కూడా. ఈ అసంబద్ధ కారణాలను ఎన్నికల కమిషన్‌కు ఎత్తిచూపడానికి తన వాదనలు వినిపించగా వాటిని ఎన్నికల కమిషన్ తిరస్కరించిందని మమతా బెనర్జీ ఆరోపిస్తున్నారు. ఇక చేసేది లేక ఆమె నేరుగా సుప్రీం కోర్టు ముందు హాజరై తన వాదనలను వినిపించారు. దీనికి సుప్రీం కోర్టు స్వాగతించింది. ఈ గజిబిజి వ్యవహారంలో మరింత సున్నితంగా వ్యవహరించాలని ఎన్నికల కమిషన్‌కు సుప్రీం కోర్టు సూచించింది. మమతా బెనర్జీ వాదించిన అంశాలు ఒక సమస్యకు ప్రాధాన్యం ఇవ్వాలని మనల్ని అడుగుతున్నాయి. వి మనదేశం ప్రజాస్వామ్యయుతంగా పనిచేయడానికి కీలకమైన అంశాలు. రాజ్యాంగం లోని ఆర్టికల్ 21 ప్రకారం ఏ వ్యక్తి తన జీవితాన్ని లేదా వ్యక్తిగత స్వేచ్ఛను కోల్పోకూడదు. చట్టం ద్వారా నిర్దేశించిన ప్రక్రియ ద్వారా తప్ప మరెప్పుడూ అలా జరగకూడదు. ప్రతి పౌరుడికీ గౌరవంగా జీవించే ప్రాథమిక హక్కు ఉంటుంది. అదే విధంగా సర్వసత్తాక గణతంత్ర దేశంలో ప్రతి పౌరునికీ ఓటు వేసే ప్రాథమిక హక్కు ఉంటుంది. కాబట్టి దానిని జీవించే హక్కుతో సమానంగా పరిగణించాలి.

## పంజాబ్‌లో రిమోట్ కంట్రోల్ హత్యలు.. భద్రతావర్గాలకు పెను సవాల్

పంజాబ్ రాష్ట్రం లో 'రిమోట్ కంట్రోల్ హత్యలు భద్రతా వర్గాలకు పెను సవాల్‌గా మారాయి. విదేశాల్లో తలదాచుకుంటున్న నేరగాళ్లు, స్థానిక ముఠాల ద్వారా హత్యలకు పాల్పడటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీ ) నేత లక్కీ ఒబెరాయ్ హత్య వెనుక కూడా విదేశీ గ్యాంగ్‌స్టర్ల నెట్‌వర్క్ ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో పంజాబ్ పోలీసులు గ్యాంగ్‌స్టర్లపై ఉక్కుపాదం మోపారు. కాగా గత కొన్నేళ్లుగా పంజాబ్‌లో గ్యాంగ్‌స్టర్ల ముఠాలు పేట్రేగిపోతున్నాయి. విదేశాల్లో ఉంటున్న ప్రధాన నేరగాళ్లు, స్థానికంగా యువకులను నియమించుకుని రాజకీయ హత్యలు, బెదిరింపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ ఈ గ్యాంగ్‌స్టర్ల నెట్‌వర్క్‌ను తమకు అనుకూలంగా మార్చుకుంది. ఖలిస్థాన్ అజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు వీరిని వాడుకుంటోంది. దావూద్ ఇబ్రహీంతో గతంలో కుదుర్చుకున్న తరహాలోనే ఈ ముఠాలతోనూ ఐఎస్ఐ ఒప్పందం చేసుకుంది. డ్రగ్స్ ద్వారా వచ్చిన డబ్బులో 40 శాతం వాటాను తీసుకుని, ఆ నిధులను ఉగ్రవాద కార్యకలాపాలకు వినియోగిస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి.



ఈ గ్యాంగ్‌స్టర్-టెర్రర్ నెట్‌వర్క్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ ఇప్పటికే విస్తృతంగా దర్యాప్తు చేస్తోంది. ఈ ముఠాలను అణచివేసేందుకు పంజాబ్ పోలీసులు 'ఆపరేషన్ ప్రేయర్-2' చేపట్టారు. 'గ్యాంగ్‌స్టర్లపై వేటు' పేరుతో జరిగిన ఈ ఆపరేషన్‌లో సుమారు 10 వేల మంది పోలీసులు పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్యాంగ్‌స్టర్ల ఇళ్లు, రహస్య స్థావరాలపై ఏకకాలంలో దాడులు చేసి 1,100 మందిని అరెస్ట్ చేశారు. మొదటి దశ ఆపరేషన్‌లో ఇప్పటికే 3,256 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని దాడులు ఉంటాయని స్పష్టంచేశారు. గత ఏడాది నవంబర్ నుంచి ఈ ఏడాది జనవరి మధ్య రాష్ట్రంలో ఆరు టార్గెటెడ్ హత్యలు జరగడంతో వ్యాపార వర్గాల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. శాంతిభద్రతలు క్షీణించాయని ప్రతిపక్షాలు ఆప్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. కాగా, ఈ నెట్‌వర్క్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ఏజెన్సీలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, అమెరికా, కెనడా అధికారుల సాయంతో విదేశాల్లోని సూత్రధారులను పట్టుకునేందుకు ఎన్ఐఏ ప్రయత్నిస్తోందని భారత అధికారులు తెలిపారు.

## మంథనిలో మున్సి" పోల్" కు సర్వం సిద్ధం

**-పోలింగ్ అధికారులకు, సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని పంపిణీ**

**-పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది**

**-గుర్తింపు పొందిన 14 రకాల ఐడెంటిటీ కార్డులలో ఏదో ఒకటి తీసుకువెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు**

**-100 శాతం ఓటింగ్ అయ్యేందుకు ఓటర్లు కృషి చేయాలని పిలుపునిచ్చిన మంథని సహాయ ఎన్నికల అధికారి ఎన్ మనోహర్**

మంథని ,రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం జరగనున్న మున్సిపల్ / కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా మంథని పట్టణంలో జరగనున్న రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికలకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మంథని మున్సిపాలిటి కి సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేసినట్లు మంథని సహాయ ఎన్నికల అధికారి, మంథని మున్సిపల్ కమిషనర్ ఎన్ మనోహర్ స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ వద్ద మంగళవారం పోలింగ్ అధికారులకు, సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంథని సహాయ ఎన్నికల అధికారి, మంథని మున్సిపల్ కమిషనర్ ఎం మనోహర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో మొత్తం 13 వార్డులలో 14,402 వేల మంది ఓటర్లు ఉన్న నేపథ్యంలో 26 పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. సుమారు 130మంది సిబ్బందితో ఎన్నికల నిర్వహణ చేపడుతున్నామని, సాయంత్రం లోపు పీఓ, ఏపీవో, ఓపీఓలు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారని అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఓటర్లందరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని, ఓటరు స్లిప్పుతో పాటు గుర్తింపు పొందిన 14 రకాల ఐడెంటిటీ కార్డులలో ఏదో ఒకటి తీసుకువెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని సూచించారు. మున్సిపల్ పరిధిలో 100 శాతం ఓటింగ్ అయ్యేందుకు ఓటర్లు కృషి చేయాలని మంథని సహాయ ఎన్నికల అధికారి, మంథని మున్సిపల్ కమిషనర్ ఎం మనోహర్ పిలుపునిచ్చారు. గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీల ప్రయత్నంతెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వం ముగియడంతో ఇప్పుడు అందరి దృష్టి పోలింగ్‌పై పడింది. మంథని మున్సిపాలిటీలో బుధవారం ఓటింగ్ జరగనుంది. గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్,బీజేపీ అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కూడా వార్డులను చుట్టేసి ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేశారు. జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు సైతం రంగంలోకి దిగి ప్రచారాన్ని హోరెత్తించడంతో గల్లీ రాజకీయం కాస్తా రాష్ట్ర స్థాయి చర్చకు దారితీసింది. ప్రజాస్వామ్య వేడుకకు సర్వం సిద్ధంపోలింగ్ సమయం దగ్గర పడుతుండటంతో అభ్యర్థులు ఇప్పుడు తెరవెనుక వ్యూహాలకు పదును పెడుతున్నారు. వార్డుల్లోని స్థానిక సమస్యల కంటే పార్టీల బలాబలాలు, వ్యక్తిగత పరపతి ఈ ఎన్నికల్లో కీలకం కానున్నాయి. ఒకవైపు రాజకీయ వేడి, మరోవైపు అధికారుల చైతన్య కార్యక్రమాల మధ్య ఓటర్లు ఎవరికి పట్టం కడతారనేది ఆసక్తికరంగా మారింది. ప్రచారం ముగియడంతో పోలీసులు నిఘా పెంచారు, సమస్యాత్మక ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం జరిగే పోలింగ్ కోసం ఎన్నికల సిబ్బంది సామాగ్రితో ఇప్పటికే ఆయా కేంద్రాలకు చేరుకున్నారు.

## స్వేచ్ఛాయుత ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి : సీపీ సునీల్ దత్

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 10 : ఖమ్మం జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంతో కూడిన నిష్పక్షపాత ఎన్నికలు జరిగేలా సమన్వయంతో పని చేయాలని సిబ్బందికి పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల బందోబస్తు విధులు నిర్వహించేందుకు సిద్ధమవుతున్న పోలీస్ సిబ్బంది ఎన్నికల విధులు, విధివిధానాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి, శాంతిభద్రతల పరిరక్షణ అంశాలపై, ఏదులాపురం మున్సిపాలిటీ సంబందించి ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సీపీ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణకు లోబడి పనిచేయాలన్నారు. ఎన్నికల నియమావళిపై సమగ్ర అవగాహన ఏర్పర్చుకుని, ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు ఎటువంటి పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో కఠినంగా ఉండాలని, అప్పగించిన భాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, పోలింగ్ కేంద్రాలను వదిలి వెళ్లవద్దని సూచించారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావాన్ని నిలువరించేందుకు ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్జ్ టీమ్స్, చెక్ పోస్టులు, రూట్ మొబైల్ పార్టీలు, ఎన్నికల ముందు, పోలింగ్ రోజు, ఓట్ల లెక్కింపు సందర్భంగా నిర్వహించే విధులలో పూర్తి అవగాహన ఉండాలన్నారు. అదేవిధంగా పోలింగ్ అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకొవాలని సూచించారు. ఐదు మున్సిపాలిటీలలో 11 వందల మంది పోలీస్ సిబ్బంది (అడిషనల్ డీసీపీలు -04, ఏసీపీలు -08, సిఐలు-25, ఎస్ఐలు- 80, పోలీస్ సిబ్బంది -975) పాల్గొంటున్నారని అన్నారు. ఎక్కడ కూడా ఘర్షణ వాతావరణం లేకుండా పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరంగా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (ఏఆర్) కుమారస్వామి, ఏసీపీ తిరుపతి రెడ్డి, నర్సయ్య, రూరల్ డివిజన్, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.





## 'సీఎంఆర్‌ను మిల్లర్లు త్వరగా పూర్తి చేయాలి'



మునుగోడు, ఫిబ్రవరి 10 : కస్టమ్ మిల్లింగ్ రైస్ (లెవీ)ని సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయాలని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ మిల్లర్లకు స్పష్టం చేశారు. మంగళవారం మునుగోడులో మల్లికార్జున రైస్ మిల్లును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లెవీని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఇప్పటికే మిల్లర్లకు సూచించడం జరిగిందనినారు. ధాన్యం సేకరణలో నల్లగొండ జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉందని, అలాగే లెవీ త్వరగా పూర్తి చేయడంలో కూడా జిల్లాకు మంచి పేరు వచ్చేలా మిల్లర్లు కృషి చేయాలని పేర్కొన్నారు.

## హ్యూమన్ ట్రాఫికింగ్‌పై స్టింగ్ ఆపరేషన్.. అమెరికాలో తెలుగు వ్యక్తి అరెస్టు



అమెరికాలో జార్జియా రాష్ట్రంలో మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో తెలుగు వ్యక్తి చాడ సుహృత్ రెడ్డి కూడా ఉండటం గమనార్హం. అట్లాంటా శివారు ప్రాంతాలైన శాండీ స్ప్రింగ్స్, డన్వుడీ పోలీసులు సంయుక్తంగా అండర్ కవర్ ఆపరేషన్ ఆపరేషన్ నిర్వహించిన వీరిని పట్టుకున్నారు. మానవ అక్రమ రవాణా, వ్యభిచార ముఠాలపై మానవ అక్రమ రవాణా లక్ష్యంగా జనవరి 29, 30వ తేదీల్లో ఆపరేషన్ శాండీ స్ప్రింగ్స్ గార్డియన్ పేరుతో అమెరికాలో పోలీసులు స్టింగ్ ఆపరేషన్ నిర్వహించారు. అట్లాంటాలోని పవర్స్ ఫెర్రీ రోడ్డు సమీపంలోని హోటళ్లలో ఈ సోదాలు నిర్వహించారు. అక్రమంగా లైంగిక కార్యకలాపాలకు పాల్పడటం, వ్యభిచారం కోసం సంప్రదించడం వంటి నేరాలు కింద 8 మందిని పట్టుకున్నారు. వీరిపై సొలిసిటేషన్ ఫర్ ఇల్లిసెట్ సెక్సువల్ యాక్ట్ కింద వీరిపై కేసులు నమోదు చేశారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. కాగా, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తెలుగువారు ఇలాంటి నేరాల్లో పట్టుబడటం ఇప్పుడు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అరెస్టయిన చాడ సుహృత్ రెడ్డిది తెలంగాణలోని వరంగల్‌గా తెలుస్తోంది. 2020లో కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన అతను ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లాడు. 2022లో అమెరికాలోని అరిజోనా స్టేట్ ఆఫ్ యూనివర్సిటీలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై ఎంఎస్ పూర్తి చేసినట్లు సమాచారం. వ్యభిచారం కింద అతనిపై కేసు నమోదైంది. ఈ కేసు రుజువైతే ఏడాది పాటు జైలుశిక్షతో పాటు రూ.90 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

## పార్లమెంట్‌లో ప్రతిపక్షాల తీరుచూసి దేశం సిగ్గుపడుతోంది : కంగనా రనౌత్

న్యూ ఢిల్లీ, ప్రతిపక్ష పార్టీలు హద్దులు దాటి ప్రవర్తిస్తున్నాయని, పార్లమెంట్ లో జరుగుతున్న పరిణామాలను చూసి దేశం సిగ్గుపడుతోందని బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడిన ఆమె విపక్షాల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. లోక్‌సభ లో రాహుల్ గాంధీ . ఆర్మీ మాజీ చీఫ్ నరవణే ప్రచురితం కాని పుస్తకంలోని అంశాలను చట్టవిరుద్ధంగా ప్రస్తావించారని కంగనా ఆరోపించారు. 'రాహుల్ గాంధీ నిన్న ఒక అనధికారిక, చట్టవిరుద్ధమైన పుస్తకాన్ని సభకు తీసుకొచ్చి మొత్తం న్యాయవ్యవస్థను అవమానించారు. ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని పుస్తక ప్రచురణ సంస్థ పెంగ్విన్ కూడా స్పష్టంచేసింది' అని కంగనా అన్నారు. ఈ పరిణామాలతో ప్రతిపక్ష పార్టీ సభ్యులు కూడా ఇబ్బంది పడుతున్నారని ఆమె వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకుని విపక్షాలు కుట్ర చేస్తున్నాయని కంగనా ఆరోపించారు. 'ప్రతిపక్ష ఎంపీలు సభలో కాగితాలు చించి స్పీకర్‌పై విసరడం, టేబుళ్లపైకి ఎక్కడం లాంటివి చేస్తున్నారు. ఇలాంటి వాళ్లు ప్రధాని మోదీ చేతిలో నుంచి కాగితాలు లాక్కోరని, ఆయనపై దాడి చేయరని గ్యారెంటీ ఏంటి..? ప్రధాని సభకు రావాలంటే మాకు దీనిపై హామీ కావాలి' అని ఆమె డిమాండ్ చేశారు. మహిళా ఎంపీలను అడ్డుపెట్టుకుని ఇలాంటి చర్యలకు పాల్పడితే పార్లమెంట్ గౌరవం ఏమవుతుందని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చ జరగనీయకుండా విపక్షాలు సభలో గందరగోళం సృష్టించడంతో లోక్‌సభ మంగళవారం కూడా వాయిదా పడింది. 'మాకు న్యాయం కావాలి' అంటూ కాంగ్రెస్ ఎంపీలు నినాదాలు చేయగా, బడ్జెట్‌పై చర్చకు సహకరించాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు వారిని కోరారు.



# 21నియోజకవర్గాల్లో అభివృద్ధి సూపర్

## గ్రేడింగ్ లు ఇచ్చిన ప్రభుత్వం

విజయవాడ, ఫిబ్రవరి 10,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ప్రవేశపెట్టిన నియోజకవర్గాల పనితీరు సూచీలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పరుగులు పెడుతోంది. వివిధ అభివృద్ధి ,సంక్షేమ సూచికల ఆధారంగా 175 నియోజకవర్గాల ర్యాంకింగ్స్ ఇచ్చింది. ప్రభుత్వం నిర్దేశించిన వివిధ అభివృద్ధి సూచికలు , సంక్షేమ పథకాల అమలు, ప్రజల సంతృప్తిని ప్రాతిపదికగా తీసుకుని ప్రకటించిన ఈ ర్యాంకుల్లో మెజారిటీ నియోజకవర్గాలు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాయి. మొత్తం 175 నియోజకవర్గాల్లో 21 నియోజకవర్గాలు ఏ ప్లస్ (ం+) గ్రేడ్ సాధించగా, 153 నియోజకవర్గాలు ఏ గ్రేడ్ దక్కించుకున్నాయి. కేవలం ఒకే ఒక నియోజకవర్గం బి గ్రేడ్‌కు పరిమితం కావడం గమనార్హం. వీటిలో 90 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన 13 నియోజకవర్గాలు రాష్ట్రానికి రోల్ మోడల్స్‌గా నిలిచాయి. రాష్ట్రంలోనే 93 శాతం మార్కులతో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నది విజయవాడ పశ్చిమ నియోజకవర్గం. ఎమ్మెల్యే సుజనా చౌదరి మార్క్ అభివృద్ధికి నిదర్శనంగా నిలిచింది. ఇక్కడ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చేపట్టిన చర్యలు, డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ, పారిశుద్ధ్య నిర్వహణలో సాధించిన పురోగతి ఈ ర్యాంకు సాధనలో కీలక పాత్ర పోషించాయి. క్షేత్రస్థాయిలో ప్రజల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించడం , విద్యా, వైద్య రంగాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంలో సుజనా చౌదరి చూపిన చొరవ ఈ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టింది.రెండవ స్థానంలో నిలిచిన గాజువాకకు 92 మార్కులు వచ్చాయి. నియోజకవర్గం పారిశ్రామికాభివృద్ధి , స్థానిక మౌలిక వసతుల కల్పనలో ఆదర్శంగా నిలిచింది. స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గంలోని కాలుష్య నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దడం మరియు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంపై దృష్టి పెట్టారు. అలాగే, మూడవ స్థానాన్ని దక్కించుకున్న కాకినాడ నగర నియోజకవర్గం స్మార్ట్ సిటీ ప్రాజెక్టుల అమలులోనూ, పారదర్శకమైన ప్రజా పంపిణీ వ్యవస్థలోనూ మేటిగా నిలిచింది. డిజిటల్ గవర్నెన్స్‌ను ప్రజలకు చేరువ చేయడంలో ఈ నియోజకవర్గ ప్రజాప్రతినిధుల కృషి స్పష్టంగా కనిపిస్తోంది.అలాగే నాలుగవ స్థానంలో నిలిచిన విజయవాడ తూర్పు నియోజకవర్గం కూడా పారిశుద్ధ్యం, పౌర సేవలలో అద్భుతమైన స్కోరును సాధించింది. ఈ ర్యాంకింగ్స్ కేవలం అంకెలకు పరిమితం కాకుండా, ఎమ్మెల్యేల మధ్య ఆరోగ్యకరమైన పోటీని పెంచడానికి దోహదపడుతున్నాయి. ప్రతి రూపాయి ప్రజల కోసమే ఖర్చు కావాలన్న ప్రభుత్వ సంకల్పం, ఈ ఫలితాల ద్వారా క్షేత్రస్థాయిలో ప్రతిబింబిస్తోంది. ఏ ప్లస్ నియోజకవర్గాల స్ఫూర్తితో మిగిలిన ప్రాంతాల్లో కూడా పాలనను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

# మొదట మున్సిపాలిటీ, తరువాత పంచాయతీ ఎన్నికలు..

విజయవాడ, ఫిబ్రవరి 10, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తోంది. మార్చి 9వ తేదీన మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన అధికారిక నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఇప్పటికే రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పదవీకాలం ముగియ వస్తుండటంతో, సకాలంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎలక్షన్ కమిషన్ సిద్ధమవుతోంది. కొత్త ఓటర్ల జాబితా తయారు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని నోటిఫికేషన్లు జారీ చేశారు.ఏపీలో మున్సిపాలిటీ, కార్పొరేషన్ల పదవీకాలం వచ్చే నెల 17తో ముగియనుంది. మరోవైపు గ్రామ పంచాయతీలో పదవీకాలం ఏప్రిల్ 2న ముగియనుంది. ?మున్సిపల్ పోరుకు సంబంధించి ఎన్నికల సంఘం ఇప్పటికే జిల్లాల వారీగా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. 2026 జనవరి 1వ తేదీని ప్రామాణికంగా తీసుకుని కొత్త ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని ఎస్ఈసీ ఆదేశించింది. మార్చి 9న ఫోటోలతో కూడిన తుది ఓటర్ల జాబితాను ప్రచురించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.ఏపీలో మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థలు (మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు) ఉన్నాయి. వీటిలో మెజారిటీ స్థానాలకు ఈ విడతలో ఎన్నికలు జరగనున్నాయి. 13,351 పంచాయతీలలో ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాట్లు మొదలు కానున్నాయి. ఇప్పటికే వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియపై అధికారులు చర్యలు చేపడుతున్నారు. మున్సిపల్ ఎన్నికల ఓటర్ జాబితాకు నోటిఫికేషన్ రావడమంటే ఎన్నికల నగరాలో తొలి ఘట్టం అని తెలిసిందే. స్థానిక సంస్థల నోటిఫికేషన్ తేదీపై స్పష్టత రావడంతో ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ రాజకీయ సమీకరణాలు మొదలుపెడతాయి.

# నైరాశ్యంలో వైసీపీ నేతలు

నెల్లూరు ఫిబ్రవరి 10, 2024 ఎన్నికల అనంతరం ఇప్పటి వరకు వైసీపీ లో స్పష్టమైన ఉత్సాహం కనిపించలేదు. నెక్స్ట్ ఎన్నికలకు ఇంకా సమయం ఉందని భావించిన చాలా మంది నేతలు, ఇప్పుడే ఎందుకు బహిరంగంగా కదలాలన్న ఆలోచనలోనే ఉండిపోయారు. మరికొందరు మాత్రం పార్టీ కార్యక్రమాలకంటే తమ వ్యక్తిగత ఇమేజ్ పెంచుకోవడమే సరిపోతుందన్న భావనతో ముందుకు సాగారు. అందుకే గత 19 నెలలుగా పార్టీ పిలుపునిచ్చిన ఉద్యమాలు, నిరసనలకు పెద్దగా స్పందన కనిపించలేదు. పూర్తిగా దూరంగా కూడా ఉండకుండా, ప్రజల్లోకి వెళ్లినట్టు వెళ్లి, కార్యక్రమాలు జరిగాయన్న ముద్ర వేసినట్టే వ్యవహారం సాగింది.ఈ పరిస్థితిపై పార్టీ అధినేత జగన్ పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. నేతల్లో చురుకుదనం రావాలని, ప్రజల మధ్య కలివిడిగా ఉండాలని సూచనలు చేశారు. అయినా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. అయితే ఇటీవల జరిగిన రెండు పరిణామాలు మాత్రం పార్టీ వాతావరణాన్ని పూర్తిగా మార్చేశాయి. ఒక్కసారిగా నేతలంతా ఏకం కావడం మొదలైంది.



ఉత్తరాంధ్ర నుంచి సీమ వరకు వైసీపీ శ్రేణుల్లో కదలిక పెరిగింది.అంబటి రాంబాబు (, జోగి రమేష్ ఇళ్లపై దాడులు జరగడం ఈ మార్పుకు ప్రధాన కారణంగా మారింది. ఈ ఘటనలను పార్టీ నేతలు తేలిగ్గా తీసుకోలేదు. ఇది కేవలం వ్యక్తిగత అంశం కాదని, తమ రాజకీయ స్వరాన్ని అణిచివేసే ప్రయత్నంగా భావించారు. ముఖ్యంగా కాపు, బీసీ వర్గాలను ఏకం చేయడం, పార్టీ వాయిస్‌ను గట్టిగా వినిపించడం అవసరమని నాయకత్వం భావించింది. అందుకే ఈ అంశాలను భుజాన వేసుకుని, ప్రజల్లోకి వెళ్లేందుకు నేతలు సిద్ధమవుతున్నారు.గతాన్ని పరిశీలిస్తే, ఇలాంటి పరిస్థితి ఒకప్పుడు టీడీపీలో కూడా కనిపించింది.

# రాజ్యసభ రేసు...

## మా కో సీటు కావాలంటూ వినతులు

విజయవాడ, ఫిబ్రవరి 10, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఇప్పుడు 'రాజ్యసభ సీట్ల' చుట్టూ తిరుగుతున్నాయి. వచ్చే జూన్ నెలలో ఖాళీ కానున్న నాలుగు రాజ్యసభ స్థానాల కోసం అధికార కూటమిలో ఇప్పటి నుంచే సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. శాసనసభలో కూటమికి ఉన్న తిరుగులేని బలంతో ఈ నాలుగు స్థానాలు ఏకగ్రీవం కావడం ఖాయమని తేలిపోవడంతో, ఆ సీట్లను దక్కించుకునేందుకు ఆశావహుల సంఖ్య భారీగా పెరిగింది.ప్రస్తుత అంచనాల ప్రకారం, మొత్తం 4 స్థానాల్లో తెలుగుదేశం పార్టీ రెండు, బీజేపీ ఒకటి, జనసేన ఒక స్థానాన్ని పంచుకునే అవకాశం కనిపిస్తోంది. తమకు ఖచ్చితంగా ఒక స్థానం కేటాయించాలని పవన్ కల్యాణ్ పట్టుబడుతున్నారు. ఇప్పటికే ఆయన ఢిల్లీ వెళ్లి కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అవ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. కూటమి ఏర్పాటులో కీలక పాత్ర పోషించినందున, తమ పార్టీకి పెద్దల సభలో ప్రాతినిధ్యం ఉండాలని జనసేన గట్టిగా కోరుతోంది.జనసేన కోటాలో సీటు దక్కితే, ప్రముఖ పారిశ్రామికవేత్త లింగమనేని రమేశ్ పేరు దాదాపు ఖరారైనట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పార్టీకి ఆయన అందిస్తున్న సహకారం, పవన్ కల్యాణ్‌తో ఉన్న సాన్నిహిత్యం ఆయనకు ప్లస్ కానున్నాయి. టీడీపీతో సత్సంబంధాలు రమేశ్ కు కలిసొచ్చే అంశంఇక టీడీపీకి దక్కే రెండు స్థానాల కోసం పార్టీ సీనియర్ల మధ్య గట్టి పోటీ నెలకొంది. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, దేవినేని ఉమా మహేశ్వర రావు, పార్టీ విధేయుడు కంభంపాటి రామ్మోహన్ రావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ప్రస్తుత సభ్యుడు సానా సతీశ్ తన పదవిని రెన్యూవల్ చేసుకోవాలని గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. సామాజిక సమీకరణాలు, పార్టీ అవసరాల దృష్ట్యా చంద్రబాబు ఎవరిని ఎంపిక చేస్తారనేది ఆసక్తికరంగా మారింది.బీజేపీకి దక్కే ఒక స్థానం విషయంలో అత్యంత ఆశ్చర్యకరమైన చర్చ జరుగుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉండి ఆ పార్టీ నుంచి బయటికొచ్చిన విజయసాయి రెడ్డి, అనూహ్యంగా బీజేపీ తరపున రాజ్యసభకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారనే వార్తలు రాజకీయ వర్గాలను షేక్ చేస్తున్నాయి. ఆయన ఇప్పటికే ఎంపీ పదవికి రాజీనామా చేయడం, బీజేపీ పెద్దలతో టచ్‌లోకి వెళ్లడం ఈ ఊహాగానాలకు బలాన్ని చేకూరుస్తోంది. ఇటీవలే తాను జూన్ నుంచి రాజకీయాల్లో యాక్టివ్ అవుతానని ప్రకటించడంతో రాజ్యసభ సీటు ఊహాగానాలు నిజమేనేమో అనిపిస్తోంది. అయితే, బీజేపీ అధిష్టానం స్థానిక నేతలకు ఇస్తుందా లేక బయటి వ్యక్తులను ప్రోత్సహిస్తుందా అనేది సస్పెన్స్‌గా మారింది.కూటమిలోని మూడు పార్టీల మధ్య ఎక్కడా అసంతృప్తి రాకుండా, సమన్యాయం ప్రాతిపదికన సీట్ల పంపకం ఉండాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. జూన్ నాటికి ఈ సమీకరణాలు మరిన్ని మలుపులు తిరిగే అవకాశం ఉంది. ఏది ఏమైనా, ఈసారి ఏపీ రాజ్యసభ ఎన్నికలు కేవలం అభ్యర్థుల ఎంపిక మాత్రమే కాదు.. కూటమి పార్టీల మధ్య సమన్వయానికి, భవిష్యత్తు రాజకీయ వ్యూహాలకు ఒక పరీక్షగా నిలవనున్నాయి.

# ఆల్ ఇన్ వన్ స్మార్ట్ కార్డులు

ఏలూరు, ఫిబ్రవరి 10, పాలనలో సరికొత్త సంస్కరణలు తీసుకువస్తున్న ఏపీ ప్రభుత్వం మరో సరికొత్త ఆలోచన చేస్తోంది. రాష్ట్రంలోని కోటీ 40 లక్షల కుటుంబాలకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు అందించాలని నిర్ణయించింది. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కింద ఈ కార్డులను అందించనున్నారు. సోమవారం రోజున జరిగిన సమీక్షా సమావేశంలో స్మార్ట్ ఫ్యామిలీ కార్డులపై అధికారులకు సీఎం చంద్రబాబు పలు కీలక సూచనలు చేశారు. జూన్ నాటికి రాష్ట్రంలో స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు పౌరసేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా పాలనావరంగా పలు సంస్కరణలు తీసుకువస్తోంది. ఈ క్రమంలోనే పాలనలో టెక్నాలజీ వినియోగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే స్మార్ట్ రేషన్ కార్డులు అందించిన ఏపీ ప్రభుత్వం.. ఇప్పుడు మరో స్మార్ట్ ఆలోచన చేస్తోంది. రాష్ట్రంలోని కోటీ 40 లక్షల కుటుంబాలకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు అందించాలని ఆలోచన చేస్తోంది. ఫ్యామిలీ కార్డు బెనిఫిట్ సిస్టమ్ ద్వారా వచ్చే జూన్ కల్లా రాష్ట్రంలోని కుటుంబాలకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు పంపిణీ చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు.సంజీవని ప్రాజెక్టు, జనాభా నిర్వహణ, పౌష్టికాహారం వంటి అంశాలపై సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం రోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సంజీవని ప్రాజెక్టు కింద జులై నాటికి రాష్ట్రంలోని 66 లక్షల హైరిస్క్ కేసులకు హెల్త్ స్క్రీనింగ్ చేయాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ క్రమంలోనే ఫ్యామిలీ బెనిఫిట్ కార్డుల గురించి చంద్రబాబు చర్చించారు. జూన్ నాటికి రాష్ట్రంలోని కుటుంబాలకు వీటిని పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపు వచ్చే సంవత్సరానికి ఏపీని ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా ప్రకటిస్తామని చంద్రబాబు తెలిపారు.మరోవైపు ఈ ఏడాది జూన్‌లోగా స్మార్ట్ ఫ్యామిలీ కార్డులను ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు పంపిణీ చేయనుంది. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కింద ఈ కార్డులను అందిస్తారు. ప్రతీ కుటుంబాన్ని ఓ యూనిట్ కింద పరిగణిస్తారు. స్మార్ట్ ఫ్యామిలీ కార్డుల మీద ప్రత్యేకంగా ఓ క్యూఆర్ కోడ్ ముద్రిస్తారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ కుటుంబం సమాచారం, వారికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలు, పీ4 అంశాలు వంటివి తెలిసేలా ఈ కార్డులను డిజైన్ చేయనున్నారు.అలాగే ఈ కార్డుల సాయంతో రేషన్ కార్డు సేవలు, ఉపకార వేతనాలు, కులధ్రువీకరణ పత్రాలు, పింఛన్ల వివరాలు, వ్యాక్సినేషన్ వంటి వివరాలను ట్రాక్ చేసేలా ప్రణాళికలు రచిస్తున్నారు. స్మార్ట్ ఫ్యామిలీ కార్డులలో కుటుంబం మొత్తం వివరాలు ఉండటంతో.. సంక్షేమ పథకాల అమలు సమయంలో అర్హులకు లబ్ధి చేకూరనుంది. అలాగే పౌరసేవలు వేగంగా అందుబాటులోకి వస్తాయి. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన వెంటనే కుటుంబం మొత్తం సమాచారం ఉండటంతో పత్రాలను మోసుకెళ్లాల్సిన అవసరం ఉండదు.

# బడ్జెట్ సమావేశాలను ప్రారంభించిన మేయర్ డాక్టర్ శిరీష,

తిరుపతి ,నగరపాలక సంస్థ చివరి ఐదవ బడ్జెట్ సమావేశాలను నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం ఎస్వీయూ సెనేట్ హాల్ లో ప్రారంభమయ్యాయి.. బడ్జెట్ సమావేశాన్ని మేయర్ డాక్టర్ శిరీష లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ....వరుసగా ఐదవ బడ్జెట్ ప్రవేశ పెట్టే కౌన్సిల్ కి మేయర్ గా ఉండే అవకాశం నాకు లభించినందుకు చాలా సంతోషంగా ఉంది.మీ అందరి సహకారంతోనే నాకు ఈ గౌరవం లభించింది. అందుకు వ్యక్తిగతంగా ప్రత్యేక అభినందనలు. చిన్న ఆశ అయితే ఉన్నింది.. అదే చివరి బడ్జట్ గ్రేటర్ తిరుపతి నగర బడ్జెట్ గా పెట్టే అవకాశం వస్తుందని. గ్రేటర్ ఆలస్యం అవుతున్నందుకు కొంత అసంతృప్తి ఉన్నా నాకు నమ్మకం ఉన్నది.. తదుపరి ఎన్నికలు మాత్రం గ్రేటర్ తిరుపతి నగర పాలక సంస్థకే జరుగుతుందని. మరో మారు రాష్ట ప్రభుత్వానికి మన కౌన్సిల్ తరపున, తిరుపతి నగర ప్రజల తరపున విజ్ఞప్తి చేస్తున్నాను గతంలో కౌన్సిల్ ఆమోదించిన గ్రేటర్ తిరుపతికి ఆమోదం తెలపాలని.బడ్జెట్ అనేది ఒక నిర్ణీత కాలానికి (సాధారణంగా ఒక సంవత్సరం) రాబోయే ఆదాయ, వ్యయాల యొక్క అంచనా ఆర్థిక ప్రణాళిక. ఇది కుటుంబం, వ్యాపారం లేదా దేశం మరియు మన లాంటి నగరం యొక్క ఆర్థిక వనరులను సమర్థవంతంగా ఉపయోగించడానికి, అనవసరమైన ఖర్చులను తగ్గించుకోవడానికి మరియు పొదుపును పెంచుకోవడానికి సహాయపడే ఒక నివేదిక. వీలైనంత వరకు మన బడ్జెట్ ను సమతుల్యత బడ్జెట్ గా రూపొందించుకుంటే బాగుంటుంది. అంటే ఆదాయ వ్యయాల సమతుల్యత అని అర్థం. బడ్జెట్ రూపకల్పనలో సమతుల్యత లోపిస్తే ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి సాధ్యం కాదు.మనం ఆమోదించబోయే బడ్జెట్ తిరుపతి నగర భవిష్యత్తుకి ఉపయోగపడే విధంగా ఉండాలి.. మన బడ్జెట్ ప్రతిపాదనలు, మన చర్చలను పరిశీలించిన తిరుపతి నగర ప్రజలకు తాము చెల్లిస్తున్న ప్రతి రూపాయిని మేము ఎన్నుకున్న మా ప్రతినిధులు చాలా జాగ్రత్తగా , బాధ్యతగా ఖర్చు పెడుతున్నారు.. మా గురించే.. మా ప్రయోజనాల కోసమే నిర్ణయాలు తీసుకున్నారని భావించాలి. ఎందుకంటే మనం ఖర్చు చేస్తున్న ప్రతి రూపాయి ప్రజల పన్నుల ద్వారానే అన్న విషయం మరిచిపోకూడదు. బడ్జెట్ చర్చలో పాల్గొనే నాతో సహా ప్రతి సభ్యుడు బాధ్యతాయుతంగా ఉండాలి.

# ఏపీలో మరో అండర్‌పాస్

నెల్లూరు, ఫిబ్రవరి 10, ఏపీలో మరో అండర్‌పాస్ నిర్మాణం దిశగా కీలక ముందడుగు పడింది. నెల్లూరులో కీలకమైన అండర్‌పాస్ నిర్మాణానికి భూసేకరణ చేపట్టారు. ఇప్పటికే ఈ అండర్‌పాస్ నిర్మాణం కోసం రూ.115 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. అయితే అధికారులు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి అన్ని కుదిరితే ఏప్రిల్ నెలలో పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు. నెల్లూరుకు ఈ అండర్‌పాస్ కీలకంగా మారనుంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సాయంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల్ని వేగవంతం చేసింది. రోడ్లు, రైల్వే లైన్లు, ఫ్లై ఓవర్లు, ఆర్వోబీలు, అండర్‌పాస్‌లు.. ఇలా ఎన్నో పనులు చేపడుతోంది. తాజాగా నెల్లూరు దగ్గర రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెడుతూ అండర్ పాస్ నిర్మాణానికి సిద్ధమైంది. నెల్లూరు సమీపంలోని చింతారెడ్డిపాళెం వెళ్లే జంక్షన్‌లో అండర్‌పాస్ నిర్మాణం చేయనున్నారు. ఈ అండర్ పాస్‌ను ఏకంగా ఆరు వరుసలుగా నిర్మించనున్నారు. వాస్తవానికి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును గతేడాది నవంబరులో మంజూరు చేసింది. అంతేకాదు టెండర్ల ప్రక్రియను పూర్తి చేయగా.. ప్రస్తుతం భూసేకరణ చేపట్టారు. ఈ పనులు శరవేగంగా పూర్తిచేసి.. ఏప్రిల్ మొదటి వారంలో పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ఈ అండర్‌పాస్ పనుల్ని పర్యవేక్షిస్తున్నారు.ఈ అండర్‌పాస్ కోసం మొత్తం రూ.115.27 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. అయితే అండర్‌పాస్ నిర్మాణానికి 3.57 ఎకరాలు భూమిని సేకరించాలని నిర్ణయించారు. ఈ నిధుల్లో రూ.22 కోట్లు భూసేకరణ కోసం కేటాయించారు. ఈ అండర్‌పాస్ కోసం భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి.. వెంటనే అధికారులు పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. అన్నీ కుదిరితే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో అండర్‌సాస్ పనులు ప్రారంభించి.. దాదాపు 15 నెలల్లో పూర్తి చేయిస్తామని చెబుతున్నారు అధికారులు. అందుకే భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నారు అధికారులు.ఈ అండర్‌పాస్‌ను చింతారెడ్డిపాళేనికి వెళ్లే మార్గంలో నిర్మిస్తున్నారు. ప్రైవేట్ మెడికల్ కాలేజీ జంక్షన్ నుంచి హరనాథపురం చివర కలిసే కృష్ణపట్నం రోడ్డు దగ్గర దాబా వరకు పనులు చేపట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ అండర్‌పాస్ ప్రస్తుతం సుమారు 2.12 కి.మీ. పొడవుతో ఉంది. ఇప్పుడు ఉన్న నాలుగు లైన్ల రోడ్డు స్థానంలో ఆరు వరుసల అండర్ పాస్ వచ్చేలా ప్లాన్ చేశారు. ఈ అండర్‌పాస్ అందుబాటులోకి వస్తే రోడ్డు ప్రమాదాలు నియంత్రించొచ్చని.. ట్రాఫిక్ ఫ్రీ జర్నీ చేయొచ్చు అంటున్నారు. మొత్తం మీద నెల్లూరు నగరానికి మరో అండర్‌పాస్ రాబోతోంది.

# కడప జిల్లాలో టూరిస్టు బస్సు బోల్తా ..

## తప్పిన పెనుప్రమాదం

కడప,కడప జిల్లాలో పెనుప్రమాదం తప్పింది. 40 మంది భక్తులతో వెళుతున్న టూరిస్టు బస్సు జమ్మలమడుగు - కన్యతీర్థం ప్రధాన రహదారిపై ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో తొమ్మిది మంది భక్తులు గాయపడ్డారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నుంచి ప్రైవేటు బస్సులో 40 మంది భక్తులు జమ్మలమడుగు మండలం కన్యతీర్థం దర్శనానికి వెళ్లారు అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని ఆలూరు రంగనాయకుల కోనకు బయలుదేరారు. ఈ క్రమంలో కొత్తగుంటపల్లె సమీపంలోని మలుపు వద్ద బస్సు స్టీరింగ్ అకస్మాత్తుగా పనిచేయకపోవడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రైల్వేకోడూరుకు చెందిన తొమ్మిది మంది భక్తులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రులను జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో ప్రాణపాయం తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు

# స్విమ్స్- స్టాఫ్ నర్సు హరిత మృతికి సంతాపం

## తెలిపిన స్విమ్స్ ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్

తిరుపతి,శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) హాస్పిటల్ సి.టి. సర్జరీ విభాగం లో స్టాఫ్ నర్సుగా విధులు నిర్వహిస్తున్న ఎం. హరిత గారు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వేలూరు సి.ఎం.సి. హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని మంగళవారం ఉదయం పాత డైరెక్టర్ కార్యాలయ ఆవరణం నందు శ్రద్ధాంజలి

కార్యక్రమాన్ని నిర్వహించారు.స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా? ఆర్.వి. కుమార్ హరిత చిత్రపటానికి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్విమ్స్ తో 10 ఏళ్లుగా మెడిసిన్, రేడియేషన్ ఆంకాలజీల విభాగాలలో కూడా నర్సుగా సేవలు అందించారు. ప్రస్తుతం సి.టి. సర్జరీ విభాగంలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్నారు. కోవిడ్ సమయంలో కూడా విశిష్ట సేవలు అందించారని ఆమె సేవలను కొనియాడారు. హరిత మృతికి సంతాపం తెలుపుతూ స్విమ్స్ సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించారు.

# ఒంగోలు చేరిన సిఐఎస్ఎఫ్ సైక్లోథాన్

ప్రకాశం,తీర ప్రాంత రక్షణపై ప్రజల్లో అవగాన కల్పించే లక్ష్యంతో సీఐఎస్ఎఫ్ చేపట్టిన సైక్లోథాన్ ప్రకాశం జిల్లా ఒంగోలు చేరింది. ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయం వద్ద సైక్లోథాన్ కు జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ స్వాగతం పలికారు. సైక్లోథాన్ లో పాల్గొన్న వారికి హారతులు ఇచ్చి జై భారత్ మాతా నినాదాలతో పోలీసు బ్యాండ్ తో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సైక్లోథాన్ కు కమాండెండ్ గా వ్యవహరిస్తున్న సంజీత్ మాట్లాడుతూ, తీర ప్రాంత ప్రజల్లో మత్తు పదార్దాలు, అక్రమ ఆయుధాల చొరబాటు వంటి వాటిపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో ఈ నెల 7వ తేదీన పశ్చిమ బెంగాల్ లో ఈ సైక్లోథాన్ ప్రారంభమైందన్నారు. మొత్తం 60 మంది సభ్యులు ఉన్న ఈ బృందంలో మహిళలు కూడా ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా మహిళా సాధికారతపై కూడా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ, సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్ ద్వారా తీర ప్రాంత ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారన్నారు. ఇది ఒక మంచి ప్రయత్నమన్నారు.

# మున్సిపాలిటీ 2026-27 బడ్జెట్‌కు ఆమోదం--

## రూ. 10254.29 లక్షలతో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన మున్సిపాలిటీ--






విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 10 :-నంద్యాల మున్సిపాలిటీ 2026?27 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 10254.29 లక్షలతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఛైర్ పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన తో మున్సిపల్ కమిషనర్ బి శేషన్న ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఈ బడ్జెట్‌కు సభ్యులు ఆమోదం తెలిపారు. బడ్జెట్‌లో ఆదాయ వనరులుగా ఆస్తి పన్ను, ఖాళీ స్థల పన్ను, నీటి చార్జీలు, వ్యాపార లైసెన్స్ ఫీజులు, షాపు అద్దెలు, భవన అనుమతుల ఫీజులు, స్టాంప్ డ్యూటీ, ఇతర వివిధ ఆదాయాలను పొందుపరిచారు. అలాగే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లు, పథకాల నిధులు కూడా చేర్చారు. ఖర్చుల విభాగంలో పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ, నీటి సరఫరా, కార్యాలయ నిర్వహణ, సిబ్బంది జీతాలు, వాహనాల నిర్వహణ, ప్రజా ఆరోగ్య సేవలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. పట్టణాభివృద్ధి దిశగా రోడ్లు, కాల్వలు, తాగునీటి లైన్లు, ఘన వ్యర్థాల నిర్వహణ, పార్కులు, ట్రాఫిక్ సిగ్నల్స్ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు కేటాయించారు. క్యాపిటల్ వ్యయాల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు, ఫ్లై ఓవర్స్, వంతెనలు, నీటి పంపిణీ పనులు, మురుగు కాల్వలు, తాగునీటి యూనిట్లు, యంత్ర సామగ్రి కొనుగోళ్లు, కంప్యూటర్ పరికరాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. ఈ బడ్జెట్ ద్వారా నంద్యాల పట్టణాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడం, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. బడ్జెట్ 2026?27మూలధన వ్యయానికి భారీ కేటాయింపులు-నంద్యాల మున్సిపాలిటీ 2026?27 ఆర్థిక సంవత్సరానికి గాను మూలధన వ్యయానికి (క్యాపిటల్ ఎక్స్పెండిచర్) సంబంధించి భారీగా నిధులు కేటాయించింది. మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యతనిచ్చారు. వాణిజ్య ప్రాంతాలు, ప్రధాన రహదారులు, డ్రెయినేజీ వ్యవస్థ, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి నిధులను కేటాయించినట్లు బడ్జెట్ అంచనాల ద్వారా స్పష్టమవుతోంది. 2024?25 సంవత్సరంలో ఖర్చు చేసిన మొత్తంతో పోలిస్తే, 2026?27 సంవత్సరానికి గాను బడ్జెట్ అంచనాలు గణనీయంగా పెరిగాయి. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 2026?27 బడ్జెట్‌లో మొత్తం రూ. 41 కోట్ల 77 లక్షల 15 వేల రూపాయల మేర మూలధన వ్యయం ప్రతిపాదించారు. గత ఏడాదితో పోలిస్తే ఇది భారీ పెరుగుదలగా భావిస్తున్నారు. 2025?26 సవరణ బడ్జెట్ అంచనాల కంటే కూడా ఈ ఏడాది బడ్జెట్‌లో అభివృద్ధి పనులకు మరింత నిధులు కేటాయించడం విశేషం. ఈ నిధుల ద్వారా పట్టణంలోని మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడతాయని, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు విస్తృతంగా అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. బడ్జెట్ అమలుతో నంద్యాల పట్టణ అభివృద్ధికి మంత్రి ఎన్ ఎమ్ డి ఫరూక్ గారు వివిధ గ్రాంట్ ల ద్వారా దాదాపు 100 కోట్లు కేటాయిస్తామని తెలిపారని మున్సిపల్ కమిషనర్ బి శేషన్న వెల్లడించారు. ఈ గ్రాంటు తో నంద్యాల పట్టణానికి మరింత ఊపు వస్తుందని మున్సిపల్ వర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశంలో కమిషనర్ బి శేషన్న. మున్సిపల్ ఎమ్ ఈ గురప్పయాదవ్. టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహ మూర్తి. డీఈలు నాగభూషణ్ రెడ్డి. పవన్ కుమార్. రసూల్. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మీనారాయణ. శివ ప్రసాద్ రెడ్డి. రెవెన్యూ అధికారి వెంకటరెడ్డి. మెప్మా సీఎంఎం భాస్కర్ రెడ్డి. మున్సిపల్ అధికారులు తదితరులు ఉన్నారు.

## ఆర్థిక అక్షరాస్యత పోస్టర్ల ఆవిష్కరణ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 10 :-భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9 నుండి 13 వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవం సందర్భంగా రూపొందించిన అవగాహన పోస్టర్లను జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్ కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏవో సుభాకర్, ఎల్డిఎం రవీంద్ర కుమార్, ఆర్సేటి డైరెక్టర్ అరుణ కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సరైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవాలంటే ఆర్థిక అక్షరాస్యత అత్యంత అవసరమన్నారు. సురక్షిత బ్యాంకింగ్ విధానాలు, డిజిటల్ లావాదేవీలలో జాగ్రత్తలు, పొదుపు అలవాట్లు, ఆర్థిక మోసాల నివారణపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ వారోత్సవం ద్వారా బ్యాంకింగ్ సేవలు, బీమా, పెన్షన్ పథకాలు, డిజిటల్ ఆర్థిక భద్రతపై వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

## శ్రీశైలంలో మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన-

**భక్తులకు పూర్తి సౌకర్యాలు కల్పించాలి--**

**జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ ఆదేశాలు-**



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 10 :-మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానానికి వచ్చే లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం శ్రీశైలంలో కలెక్టర్, ఎస్పీ కలిసి భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. దేవస్థానం ప్రారంభ ద్వారం నుంచి క్యూ లైన్లు, త్రాగునీటి ఏర్పాట్లు, అల్పాహార పంపిణీ కేంద్రాలు, పారిశుధ్య సదుపాయాలను పరిశీలించి మరింత మెరుగైన వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. శివస్వాములు విశ్రాంతి తీసుకునే చంద్రావతి కళ్యాణ మండపాన్ని సందర్శించి అక్కడ కల్పించిన సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. దర్శనం అనంతరం నిష్క్రమణ వరకు ఏర్పాటు చేసిన మార్గాలను పరిశీలించి భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు. భద్రతా చర్యల్లో భాగంగా ప్రధాన ద్వారాల వద్ద, నిష్క్రమణ మార్గాలలో డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలు తలెత్తిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. మహాశివరాత్రి పర్వదినాన భారీగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో చేపట్టిన అదనపు ఏర్పాట్లను కూడా కలెక్టర్, ఎస్పీ పరిశీలించారు. భక్తులు పోలీసు అధికారుల సూచనలు పాటిస్తూ తమ వాహనాలను నిర్ణీత పార్కింగ్ ప్రాంతాలలో నిలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు, దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కైలాస ద్వారం నడకదారి పరిశీలన--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , ఫిబ్రవరి 10 :-మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీశైలంలోని కైలాస ద్వారం వద్ద ఉన్న నడకదారిని జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా మంగళవారం పరిశీలించారు. నడకదారిలో భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భక్తుల ఆరోగ్య భద్రత దృష్ట్యా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులు, టాయిలెట్‌ల శుభ్రత, శుద్ధమైన తాగునీటి సరఫరా, భోజన ఏర్పాట్ల అమలును కలెక్టర్ పరిశీలించారు. నడకదారిలో వస్తున్న భక్తులతో నేరుగా మాట్లాడి, సౌకర్యాలపై వారి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యవంతమైన దర్శనానికి అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా కొనసాగించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.




## శ్రీ కాళహస్తి దేవస్థానానికి 40 టన్నుల కూరగాయల వితరణ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 10-శ్రీకాళహస్తిలో నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు నంద్యాల పట్టణానికి చెందిన మార్కెట్ ప్రసాద్ శ్రీ కాళహస్తి దేవస్థానానికి 40 టన్నుల కూరగాయలను వితరణ చేశారు. భక్తుల సేవే ప్రధాన లక్ష్యంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టడం విశేషంగా నిలిచింది. నంద్యాల నుంచి సోమవారం సాయంత్రం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లారీలో భారీగా కూరగాయలను శ్రీకాళహస్తికి తరలించారు. మంగళవారం ఈ కూరగాయలను శ్రీ కాళహస్తి దేవస్థానం కార్యనిర్వహణాధికారి టి బాపిరెడ్డి కి అధికారికంగా అప్పగించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు అందించే అన్నప్రసాదం, నైవేద్యాలు, ఆలయ అవసరాల కోసం ఈ కూరగాయలు ఉపయోగపడనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ప్రతి ఏటా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ కాళహస్తి దేవస్థానానికి లక్షలాది భక్తులు తరలివస్తారని, వారి కోసం నిరాఘాటంగా అన్నప్రసాదం అందించాలనే ఉద్దేశంతో మార్కెట్ ప్రసాద్ ఈ విరాళాన్ని అందించినట్లు పేర్కొన్నారు. భక్తుల ఆకలిని తీర్చడమే నిజమైన సేవ అనే భావనతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. అనంతరం మార్కెట్ ప్రసాద్ శ్రీ కాళహస్తి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ తో స్నేహపూర్వకంగా కలసి బ్రహ్మోత్సవాల నిర్వహణ, భక్తుల సౌకర్యాలపై చర్చించారు. నంద్యాల నుంచి వచ్చిన ఈ భారీ విరాళం ఉత్సవాల ఏర్పాట్లకు మరింత బలం చేకూరుస్తుందని దేవస్థానం అధికారులు అభిప్రాయపడ్డారు. భక్తుల సేవలో నంద్యాల ప్రజల భాగస్వామ్యం అభినందనీయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెందరో ముందుకు రావడానికి ప్రేరణగా నిలుస్తాయని దేవస్థానం అధికారులు పేర్కొన్నారు.



## మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 10-మహానంది పుణ్యక్షేత్రంలో ఈ నెల 13వ తేదీ నుంచి నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరెడ్డి మంగళవారం క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి, సౌకర్యాల పనులను ఆయన స్వయంగా పరిశీలించి సిబ్బందికి అవసరమైన సూచనలు, సలహాలు చేశారు. ఈ నెల 12వ తేదీన ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు నిర్వహించనున్న నేపథ్యంలో కళావేదిక ఏర్పాట్ల పనులను ప్రత్యేకంగా పరిశీలించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకొని వేదికతో పాటు కూర్చునే సదుపాయాలు, శబ్దవ్యవస్థ, భద్రతా చర్యలను సమర్థవంతంగా ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. అలాగే ఆలయ ప్రాంగణం అంతటా చేపట్టిన విద్యుత్ అలంకరణ పనులను పరిశీలించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దర్శన మార్గాలు, వెలుతురు ఏర్పాట్లు మరింత సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, వేద పండితులు పాల్గొన్నారు.



## శ్రీశైలంలో భద్రతా ఏర్పాట్ల పరిశీలన--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 10-మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలంలో కొనసాగుతున్న భద్రతా ఏర్పాట్లను కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ మంగళవారం పరిశీలించారు. జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారిని దర్శించుకునేందుకు దేశం నలుమూలల నుంచి భారీగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో భక్తుల భద్రతకు తీసుకుంటున్న చర్యలను వారు పరిశీలించారు. గుడి పరిసర ప్రాంతాలు, ఆలయ ప్రవేశ ద్వారాల వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లు, దర్శనం అనంతరం నిష్క్రమించే మార్గాలు, శివస్వాములు బస చేసే చంద్రావతి కళ్యాణమండపం, ప్రత్యేక క్యూలైన్లు, పార్కింగ్ ప్రాంతాలను స్వయంగా సందర్శించారు. అలాగే సీసీ కెమెరాల ద్వారా భక్తుల రద్దీ పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేయాలని, విధుల్లో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. శ్రీశైల దర్శనానికి వచ్చే భక్తులు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసుల సూచనలు పాటిస్తూ వాహనాలను కేటాయించిన పార్కింగ్ ప్రాంతాలలోనే నిలపాలని, రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిపివేయవద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. భక్తులు సంయమనం పాటిస్తూ సహకరించాలని కోరారు.

## విద్యార్థినుల భద్రత ప్రశ్నార్థకం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 10-నంద్యాల పట్టణంలో కళాశాలలు, పాఠశాలలు, మహిళా హాస్టళ్ల పరిసరాల్లో ఆకతాయిల వేధింపులు పెరిగాయని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలు జి. లక్ష్మీదేవి ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రేమ పేరుతో అసభ్య ప్రవర్తన, వెంబడింపులు నిత్యకృత్యంగా మారాయని తెలిపారు. ఈ పరిస్థితుల వల్ల విద్యార్థినులు మానసిక క్షోభకు గురవుతున్నారని అన్నారు. హాస్టళ్లు, కోచింగ్ సెంటర్ల వద్ద షీటీమ్ తనిఖీలు విస్తరించి, మఫ్టీలో పోలీసులు గస్తీ తిరిగి ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు ఉన్నతాధికారులను ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకురాళ్లు ఎస్. సుశీలమ్మ, ఎస్. మున్ని, పద్మ తదితరులు పాల్గొన్నారు.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**